# వ్యుషితాశ్వుడు

జీవితంలో సాధించదలచినవన్నీ యౌవనంలోనే సాధించాడు పౌరవంశజుడు వ్యుషితాశ్వుడు.

వ్యుషితాశ్వుని కీర్తి ప్రతిష్ఠలు అన్నిదేశాలు వ్యాపించాయి. తన రాజ్యానికి నలుదిక్కుల నున్న మహారాజులందరినీ ఓడించి వారిని అదుపులో పెట్టాడు. అంతేకాక, ధర్మపథానికి అవసరమైనవని పెద్దలు నిర్ణయించిన యజ్ఞయాగాదులు అతినిష్ఠతో నిర్వహించాడు.

'వ్యుషితాశ్వుని ప్రజలకు శాంతి భద్రత లున్నాయి. శత్రుభయం లేదు. దేశం సస్యశ్యామలంగా ఉంది.

వ్యుషితాశ్వునికి ఇహపరసంబంధమైన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించిన తర్వాత ఇక తను చేయవలసిందేమిటో తెలియలేదు.

విశ్రాంతి ఎక్కువైంది. యౌవనవంతుడైన రాజుకు ఆ అతి విశ్రాంతి చిరాకు కలిగించింది. అతనికి శౌర్యప్రతాపాలు ప్రదర్శింపవలసిన అవసరం కలగటంలేదు.

వ్యుషితాశ్వుడు ఉద్యానవన విహారానికి బయలుదేరాడు. అక్కడి వాతావరణం అతి ప్రశాంతంగా ఉంది. ఎడతెగకుండా రాజ్యపాలనలో నిమగ్నుడైన అతని మనసుకి ప్రకృతిని తిలకించే తీరిక లేకపోయింది ఇంతకాలం.

ఆ ఉద్యానవనంలో ప్రవేశించిన అతని చెవులకి పక్షుల కిలకిలారావాలు స్వాగతవచనాల్లా వినిపించాయి. పక్షుల ప్రణయ సంభాషణలు వినాలనే కుతూహలంతో వాటిదిక్కే చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

వాటి భాష తనకి వస్తే? మహారాజుకి నవ్వొచ్చింది. ప్రకృతి సహజమైన శృంగారం సృష్టికి ఎంత అందాన్ని చేకూరుస్తుందో అనుకున్నాడు. ఆ జంటల క్రీడా విశేషాలను తిలకిస్తూ తన్మయత్వంతో.

ఆ వనంలో అడుగడుగు వేస్తుంటే అతని మనసు ఉద్రేక పూరితమైంది. సృష్టి రహస్యం మధురాతిమధురమైందని అతని మనసుకి మరొక్కసారి స్ఫురించింది

వ్యుషితాశ్వుడు నలుదిక్కుల రాజుల్ని గెలిచినపుడు, ఆ రాజులు కన్యలనెందరినో బహూకరించారు అతనికి. నిత్యం యుద్ధాల్లో మునిగిన అతను ఆ కన్యలపై దృష్టి కేంద్రీకరించలేకపోయాడు. మనసు పెంచుకోలేకపోయాడు.

అతని ఆలోచనలు అంతఃపురంవైపు మరలటంతో, ఉద్యానవనం నుంచి తిన్నగా అటు నడకసాగించాడు. అంతఃపుర కన్యలు ఎదురొచ్చి మహారాజుకు మర్యాదలు చేస్తుంటే వారందరినీ శ్రద్ధగా పరిశీలించిన అతను ఎలాంటి అనుభూతినీ పొందలేకపోయాడు. ఏ ఒక్క స్త్రీ కూడా అతని మనసుని దోచుకోలేకపోయింది. నిరాశతో వెనుదిరిగిన వ్యుషితాశ్వుడు తిరిగి మనశ్శాంతికోసం ఉద్యానవనం చేరాడు.

సంధ్యాకాంతుల్లో అక్కడి వృక్ష సంపదంతా పచ్చని, ఎర్రని కాంతులతో మిలమిలా మెరిసిపోతోంది.

పట్టపురాణి భద్రాదేవి చెలికత్తెలతో అచట విహరిస్తూ వ్యుషితాశ్వుని చూసింది. మహారాజును గమనించిన చెలికత్తెలు నిష్క్రమించారు.

అమిత సౌందర్యరాశి అయిన భద్రాదేవిపైన ఆయన చూపులు నిలిచాయి. సాయంసంధ్యాకాంతులు ఆమె సౌందర్యాన్ని మరింత ప్రస్ఫుటం చేశాయి. ఇంత వరకు రాజ్యపాలనే జీవితమనుకుని ఆమెని నిర్లక్ష్యం చేసినందుకు బాధపడ్డాడు ఆ క్షణంలో వ్యుషితాశ్వుడు.

ఆమెను సమీపించి కుశల ప్రశ్నలు వేస్తుంటే, అతని దృష్టి చెట్లపైనున్న పక్షుల జంటలపై బడింది. అప్రయత్నంగా భద్రాదేవి భుజంపైన చేయివేశాడు.

ఆమె చిరునవ్వుతో ఆయన ముఖం చూసింది. పక్షుల కిలకిలా రావాలు వింటూ, తన్మయత చెందుతున్న అతన్ని చూస్తుంటే భద్రాదేవికి నవ్వు ఆగలేదు. ఆమె కిలకిలలు ఆ ఉద్యానవనపక్షుల కిలకిలారావాలతో మేళవిస్తుంటే, వ్యుషితాశ్వుడు ఉద్రేకపరవశుడై ఆమెను కౌగిలిలోకి తీసుకున్నాడు. భద్రాదేవి అతని కౌగిలి నుంచి తప్పించుకుని, అంతఃపురానికి దారితీస్తుంటే ఆమెను అనుసరించాడు వ్యుషితాశ్వుడు.

భద్రాదేవి శరీర సౌందర్యం అతనికి విభ్రాంతిని కల్గించింది. ఆమె మాటలు, చేష్టలు, ఆమె ఆతనిపట్ల చూపిస్తున్న అవ్యాజానురాగం అతన్ని బద్ధుణ్ణి చేస్తున్నాయి. ఆమె సాంగత్యంలో తన్నుతాను మరిచిపోయాడు. ఆమె ప్రేమ అతన్ని ఉన్మత్తుణ్ణి చేస్తోంది. ఆమె ప్రేమతప్ప మరొక ప్రపంచం లేదనుకుంటూ అంతఃపురంలోనే అతను కాలం గడిపేస్తున్నాడు.

కాలాన్ని మరిచిపోయి ఏ కార్యక్రమంలో వుంటే, దాంట్లోనే నిమగ్నమై పోవటం అతని స్వభావం. రాజ్యకార్యభారాలు సక్రమంగా నిర్వర్తించిన అతని మనసు శృంగార సామ్రాజ్యాధిపత్యాన్ని అభిలషించటం ప్రారంభించింది. ఆ సామ్రాజ్యం అనంతమైందనిపించింది అతనికి.

దేశానికి ఎల్ల లుంటాయి. రాజ్యానికి పరిమితులుంటాయి. కానీ శృంగార సామ్రాజ్యానికి అవేవీ లేవని తలచిన వృషితాశ్వుడు ఆ శృంగార రసాస్వాదనా లోలుడై, రాత్రింబవళ్ళ భేదం గుర్తించే స్థితి దాటిపోయాడు. భద్రాదేవి అతని శృంగార దేవత అయిపోయింది. ఆ దేవతారాధనమే అతని జీవిత ధ్యేయమై పోయింది.

కానీ ప్రకృతి మితిమీరిన విషయలోలతను సహించలేదు. అతని శరీరం పరాజయం పొందింది. అతని రుగ్మతని క్షయగా గుర్తించారు వైద్యులు. ఎంతటి ఘనవైద్యునికైనా మహారాజుని ఆరోగ్యవంతుణ్ణి చేయటం సాధ్యంకాలేదు.

పరలోక గతుడు కానున్న వృషితాశ్వునిచూస్తే, జీవితమంతా శూన్యంగా బతకటం తనకు సాధ్యం కాదనిపించింది భద్రాదేవికి. ఇంతకాలం ఆ మహారాజు ప్రేమలో ఓలలాడిన తను ఇక ఒంటరిగా జీవించలేదనే భావం ఆమెని కంపింప చేసింది. జీవచ్ఛవంలా బతకటంకన్నా తనూ అతనితోబాటు మరణించాలని నిశ్చయించుకుంది.

కఠోరదీక్షాబద్ధురాలై దర్భశయనం ఏర్పాటు చేసుకుని, మృతుడైన వృషితాశ్వుని కౌగిలించుకుంది.

కానీ, యజ్ఞయాగాదులతో, నియమనిష్ఠలతో సద్గతికి సోపానం ఏర్పరచు కొన్న వృషితాశ్వుడు, భార్య కఠోర నియతిని ప్రదర్శిస్తుంటే ఆమెనుంచీ ప్రేమ బంధాలు తెంచుకు పరలోక యాత్ర సాగించటానికి మనసు రాలేదు.

వ్యుషితాశ్వుని శరీరం నుంచి దివ్యవాణి భద్రాదేవిని అనునయిస్తూ పలికింది:

"మరణం భౌతికం, నీపట్ల నా ప్రేమ నిత్యమైనది. నువ్వు అకాలమరణం కోరుకోవటం అధర్మం."

"నాథా, మీవల్ల నాకు పుత్రసంతానమైనా కల్గితే, వారిలో నీ ప్రతిరూపాన్ని చూసుకుంటూ జీవించగలను. లేకపోతే నాకు అకాలమరణమే శరణ్యం."

అనంతమైన పుణ్యసంపదలు, దైవబలం పొందిన వ్యుషితాశ్వుని మనసు కరిగింది.

భద్రాదేవి శృంగార రసాధినాథుడనై, సంతాన వాంఛను అలక్ష్యం చేశానని అతను పరితపించాడు.

"నా జీవితమంతా నీ ప్రేమతో బతికిన నేను, నీ కోరిక తీర్చటం ధర్మమే. నిన్ను మాతృమూర్తిని చేస్తాను."

భద్రాదేవి కన్నీళ్ళలో వెలుగురేఖ మెరిసింది.

"ఋతుమతివైన ఎనిమిదవనాడు వచ్చి నీ అభీష్టం తీరుస్తాను. ఆ తర్వాతే ఈ లోకాన్ని శాశ్వతంగా వీడి పరలోకం చేరతాను. నీ కఠోర దీక్ష విరమించు."

దైవబలసంపన్నుడైన వ్యుషితాశ్వుని ఆత్మ ఆమెయందే నిలిచింది.

అతను వాగ్దానం నిలబెట్టుకున్నాడు.

అతని ప్రేమ ఫలితంగా అతని ప్రతిబింబాల్లాటి కుమారులను కన్నది భద్రాదేవి.

వ్యుషితాశ్వునితో గడిపిన ప్రేమమయ జీవితాన్ని తల్చుకుంటూ, కుమారుల్లో అతని రూపంచూస్తూ, తన సమయ మాసన్నమయేవరకు కాలం గడిపింది ✱

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం:
ఆదిపర్వం : పంచమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక : 20-4-1988)